క్లుప్తంగా

ఉరుకుందలో భక్తుల సందడి



పూజలందుకుంటున్న ఈరన్నస్వామి

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద ఈరన్నస్వామిని సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దీంతో స్వామి క్షేత్రం భక్తులతో సందడి నెలకొంది. అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు తెల్లవారుజామున సుప్రభాత సేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు. ఆలయంలో పలువురు భక్తులు పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు.

కారును ఢీకొన్న టిప్పర్



టిప్పర్ ఢీకొనడంతో దెబ్బతిన్న కారు

మంత్రాలయం రూరల్: మంత్రాలయం మండల కేంద్రంలోని అభయాంజనేయస్వామి ఆలయ సమీపంలో ఆగి ఉన్న కారును టిప్పర్ ఢీకొట్టింది. సోమవారం కర్ణాటకకు చెందిన ఓ కుటుంబం మంత్రాలయం వచ్చింది. అభయాంజనేయస్వామిని దర్శించుకుని తిరిగి వస్తూ కాలకృత్యాలు తీర్చుకునేందుకు రోడ్డు పక్కన కారును నిలిపి వేశారు. అందులో ఇద్దరు మహిళలు కూర్చుని ఉండగా వెనుక నుంచి వస్తున్న మట్టిలోడు టిప్పర్ ఒక్కసారిగా ఢీకొట్టింది. కారు వెనుకభాగం నుజ్జునుజ్జు అయ్యింది. కారులో కూర్చున్న మహిళలు భయాందోళనకు గురై కేకలు వేశారు. టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ఇలా జరిగిందని బాధితులు వాపోయారు.

అక్రమ రోడ్డు నిర్మాణం ఆపాలి



మున్సిపల్ డీఈకి వినతిపత్రం ఇస్తున్న శ్మశాన వాటిక పరిరక్ష కమిటీ నాయకులు

ఎమ్మిగనూరు టౌన్: హిందూ శ్మశాన వాటికలో అక్రమంగా చేపట్టిన రోడ్డు నిర్మాణాన్ని ఆపాలని శ్మశాన వాటిక పరిరక్షణ కమిటీ నాయకులు బతకన్న, నారాయణ, పెద్దయ్య, కుమ్మరి వెంకటేష్ సోమవారం మున్సిపల్ కార్యాలయంలో డీఈ నీరజకు, రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ శేషఫణికి వినతి పత్రాలు అందజేశారు. వెంకటాపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన ప్లాట్‌కు వెళ్లడానికి ఏకంగా శ్మశాన వాటిక సరిహద్దులను చెరిపి గ్రావెల్ వేసి రోడ్డు నిర్మించుకుంటున్నాడని, అడ్డుకోవాలని వారు కోరారు. వినతిపత్రాలు ఇచ్చిన వారిలో కమిటీ నాయకులు నాగరాజ్ యాదవ్, యాపిలయ్య, రాఘవేంద్ర, యల్లప్ప, నారాయణ, నాగముని ఉన్నారు.

దుకాణాలపై చర్యలు తీసుకోవాలి



ధర్నా చేస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరు టౌన్: అధిక ధరలకు పత్తి విత్తనాలు విక్రయిస్తున్న దుకాణాలపై చర్యలు తీసుకోవాలని, నకిలీ పత్తి విత్తనాలు అంటగడుతున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యన్న డిమాండ్ చేశారు. సోమవారం వ్యవసాయ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి నకిలీ విత్తనాలను తీసుకొచ్చి రైతులకు అంటగడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు స్పందించి నకిలీ విత్తన విక్రయదారుల నుంచి రైతులను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ నాయకులు పెద్దారెడ్డి, మల్లికార్జున, నరసింహులు, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు బాలరాజు, బాబు, వీరాంజనేయులు పాల్గొన్నారు.

బెల్టుషాపులపై చర్యలు తీసుకోవాలి



ఎక్సైజ్ సీఐ ఎస్.కె.జె.సైదులుకు వినతి పత్రం అందజేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

ఆదోని రూరల్: పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా బెల్టుషాపులు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు వీరేష్, నాయకులు వెంకటేష్, మోహన్ కోరారు. సోమవారం స్థానిక ఎక్సైజ్ సీఐ ఎస్.కె.జె.సైదులును కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కర్ణాటక మద్యం ఏరులై పారుతోందన్నారు. వార్డుల్లో బెల్టు షాపులు ఎత్తి వేయాలన్నారు. అధికారులు బెల్టు షాపులను రద్దు చేయాలని కోరారు.

చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య, పేద గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించేందుకు అంగన్‌వాడీ కేంద్రాలను ప్రారంభించారు. అయితే పాలకుల నిర్లక్ష్యం కారణంగా కేంద్రాల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో కేంద్రాలను నిర్వహిస్తుండటంతో సరైన వసతులు లేక అంగన్‌వాడీ కార్యకర్తలతో పాటు లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక అద్దె, వేతనాలు సకాలంలో చెల్లించక పోతుండటంతో సిబ్బంది అప్పులు చేసి చెల్లించాల్సి దుస్థితి నెలకొంది.

అద్దె భవనాలే గతి!



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

- ఆదోని నియోజకవర్గంలో 132 అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లోనే
- అరకొర సౌకర్యాలతో చిన్నారులు, గర్భిణుల అవస్థలు
- అద్దె కోసం అడ్వాన్స్ కింద రూ. 50వేల నుంచి రూ.లక్ష చెల్లిస్తున్న కార్యకర్తలు

ఆదోని సెంట్రల్: గ్రామాలు, పట్టణంలో కనీస సౌకర్యాలు లేని అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. దీంతో చిన్నారులు, బాలింతలు, గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నారులకు ఆట పాటలతో పాటు నాణ్యమైన భోజనం అందిస్తున్నామని గొప్పలు చెప్పుకొంటున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు.. భవనాలను నిర్మించడంలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలున్నాయి. సొంత భవనాలు లేక పోవడంతో కార్యకర్తలే భవనాలకు అడ్వాన్స్‌లు చెల్లించి కేంద్రాలను నడుపుకునే దుస్థితి దాపురించిందని సిబ్బంది వాపోతున్నారు.

నియోజకవర్గంలో..

ఆదోని పట్టణంలో 126, నియోజకవర్గంలోని గ్రామాల్లో 98 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. మొత్తం 224 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. అందులో 132 కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. భవనం బాడుగకు ఇవ్వడానికి ఇంటి యాజమానులు ముందుగా అడ్వాన్స్ అడుగుతున్నారు. దీంతో అడ్వాన్స్‌గా రూ.50వేలు నుంచి రూ.లక్ష వరకు ఇవ్వాల్సి వస్తోంది. సకాలంలో బాడుగ ఇవ్వక పోతే ఖాళీ చేయమంటారు. ఇంటి బాడుగతో వంటకు అయ్యే బిల్లులు కూడా మూడు, ఆరు నెలలకోసారి వస్తుండటంతో చేతి నుంచి కడుతున్నామని, ఇందుకు అప్పు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. కేంద్రాలకు సొంత భవనాలు లేక పోవడంతో ప్రతి నెల పట్టణంలో రూ.5వేల నుంచి రూ.6వేలు, గ్రామీణ ప్రాంతంలో రూ.2వేలు అద్దె చెల్లించాల్సి వస్తోంది.

అరకొర సౌకర్యాలు

నియోజకవర్గంలోని అయా కేంద్రాల్లో గర్భిణులు 2,504, బాలింతలు 2,534 మంది ఉన్నారు. 3 – 6 ఏళ్ల లోపు పిల్లలు 8,188 మంది ఉన్నారు. వీరందరికి పాలు, గుడ్డుతో పాటు భోజనం అందిస్తున్నారు. కేంద్రాల్లో కనీస సౌకర్యాలు లేక లబ్ధిదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. అద్దె భవనాల్లో నిర్వహించడం వల్ల సరకులు నిల్వ ఉంచడానికి, వంట చేయడానికి, చిన్న పిల్లలకు మాట, నడక, ఆట, పాటలు నేర్పించడానికి ఇబ్బందులకు గురవుతున్నారు. పిల్లలకు చదువు చెప్పాలంటే కనీసం మూడు గదులైన ఉండాలి. అలాంటి అద్దె భవనం దొరకాలి అంటే బాడుగ రూ.వేలల్లో చెబుతున్నారు. దీనికి తోడు భారీగా అడ్వాన్స్ అడుగుతున్నారు.

నిలిచిన భవన నిర్మాణాలు..

అంగన్‌వాడీ కేంద్రాల్లో కూడా మౌలిక వసతులను కల్పించాలని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాడు–నేడు కింద పనులు చేపట్టింది. దీంతో సొంత భవనాలు కలిగిన అంగన్‌వాడీ కేంద్రాల్లో పనులను చేపట్టి నాడు నేడు పనులను కూడా చేపట్టారు. మరి కొన్ని చోట్ల పాఠశాలల్లోనే ఒక గదిని కేటాయించి కేంద్రం నడపడానికి అన్ని వసతులను వారికి అప్పగించారు. సొంత భవనాలు లేక అనుకూల పరిస్థితులు లేని ప్రాంతాల్లో అంటే ఇస్వి, మదిరె వంటి గ్రామాల్లో ఆరు అంగన్‌వాడీ భవన నిర్మాణలకు నిధులను మంజూరు చేసి భవన నిర్మాణాలను చేపట్టింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. టాప్ లెవల్ పూర్తి చేసుకొని ఫ్లోరింగ్, ప్లాస్టరింగ్ వంటి చిన్న చిన్న పనులతో ఆగిపోయాయి. ఆ పనులు పూర్తి చేస్తే వినియోగంలోకి వస్తాయి. కొంత వరకు సమస్య తీరుతుంది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది గడుస్తున్న ఇంతవరకు వాటి నిర్మాణాలపై ఎలాంటి చర్యలు చేపట్టలేదు.

సొంత భవనాలను నిర్మించాలి



అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేక పోవడం ద్వారా భవనాలను అద్దెకు తీసుకోవాల్సి వస్తోంది. భవనాన్ని బాడుగకు అడిగితే అడ్వాన్స్ అడుగుతున్నారు. దీంతో విధిలేని పరిస్థితిలో అడ్వాన్స్‌లు ఇచ్చుకొని కేంద్రాలను నడుపుతున్నారు. కొన్నిసార్లు ప్రభుత్వం నుంచి వచ్చే బాడుగ ఆలస్యమైతే చేతి నుంచి ఇచ్చుకోవాల్సి వస్తోంది. ఇలా చాలీచాలని జీతాలతో సర్దుబాటు చేసుకుంటూ కార్యకర్తలు కాలాన్ని వెళ్లదీస్తున్నారు. అదే సొంత భవనం ఉంటే ఈ సమస్య ఉండదు. సొంత భవనాలను నిర్మిస్తే ఇబ్బందులు తొలుగుతాయి.
– కే. వెంకటమ్మ సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

అధికారులకు విన్నవించాం



గతంలో నిర్మాణం చేపట్టిన భవన నిర్మాణాలు ఆగిపోయాయి. వాటిని చేపట్టాలని అధికారులకు విన్నవించాం. అధికారులు స్పందించి నిధులు మంజూరు చేస్తే పనులను చేపడుతాం.గ్రామీణ ప్రాంతాల్లో ఇబ్బందులు ఉండే ప్రాంతాలను గుర్తించి భవనాలను నిర్మాణం చేపట్టాలని కూడా అధికారులకు ప్రతిపాదించాం. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే వాటి నిర్మాణాలు వెంటనే ప్రారంభిస్తాం.
– ఉమామహేశ్వరమ్మ సీడీపీఓ, ఆదోని

ఫ్యాకల్టీలు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్

ఎమ్మిగనూరురూరల్: ఉన్నత విద్యాభివృద్ధికి ఫ్యాకల్టీలు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఎర్రకోట సెయింట్‌జాన్స్ ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ సూచించారు. సోమవారం కాలేజీలో ఫ్యాకల్టీలకు విద్యానైపుణ్యాలపై కంప్యూటర్ సైన్సు ఏ1 విభాగం, ఎన్ఐటీ వరంగల్–ఈఅండ్ఐటీసీ అకాడమీ సహకారంతో భారత ప్రభుత్వం ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ సౌజన్యంతో »ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ ఏ1 అండ్ ఐఓటీ« అంశంపై వారం రోజులు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ శిక్షణలో రిసోర్స్ పర్సన్స్ చెప్పే విషయాలను తెలుసుకోవాలన్నారు. వరంగల్‌కు చెందిన ఫ్యాకల్టీ డాక్టర్ సురేష్ బాబు, సీఏఐ హెచ్ఓడీ డాక్టర్ వెంకటనరసింహారెడ్డి పాల్గొన్నారు.

నేడు పీఆర్ ఇంజినీర్ల బదిలీలకు కౌన్సెలింగ్

కర్నూలు(అర్బన్): పంచాయతీరాజ్ ఇంజినీర్ల బదిలీల కౌన్సెలింగ్ ఈ నెల 27వ తేదీన ఉదయం 10 గంటలకు అనంతపురం పీఆర్ పర్యవేక్షక ఇంజినీరు కార్యాలయంలో జరుగుతుందని పీఆర్ ఎస్ఈ వీ.రామచంద్రారెడ్డి తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. జోన్ –4 పరిధిలోని ఉమ్మడి కర్నూలు, అనంతపురం, వైఎస్సార్ కడప, చిత్తూరు జిల్లాలకు చెందిన పీఆర్ ఇంజినీర్ల బదిలీలకు సంబంధించి జిల్లాలో ఐదేళ్లు పూర్తయిన వారిలో ముగ్గురు డీఈఈ, ఆరుగురు ఏఈలు ఉన్నారని చెప్పారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



మౌర్యభరద్వాజ్, సబ్‌కలెక్టర్

ఆదోని రూరల్: తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. అత్యవసరమైతే తప్పా ప్రజలు బయటకు వెళ్లకూడదని, దిగువ ప్రాంతాల్లో నివసించే వారు సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాలని సూచించారు. డివిజన్ యంత్రాంగం పూర్తిగా అప్రమత్తంగా ఉందని, అవసరమైన సహాయ చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా ఉందన్నారు. ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో, చెట్ల కింద, విద్యుత్ స్తంభాలు, టవర్స్, మట్టి మిద్దెల కింద ఉండకుండా సురక్షిత ప్రదేశాలకు వెళ్లాలని సూచించారు. విద్యుత్ తీగలు జారి పోవడం, మట్టి మిద్దెలు కూలిపోవడం వంటి ప్రమాదాలు సంభవించవచ్చునని, సంబంధిత అధికారులు ముందస్తుగా జాగ్రత్తలు తీసుకొని ప్రజలను అప్రమత్తం చేయాలని సబ్‌కలెక్టర్ ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల కోసం ప్రత్యేకంగా డివిజన్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు ఎటువంటి అత్యవసర పరిస్థితుల్లోనైనా 83339890152 నంబర్‌కు కాల్ చేయవచ్చని సూచించారు.

ఎన్నాళ్లీ పడిగాపులు



బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద ఆధార్‌కార్డు ఈకేవైసీ బాధితులు

మంత్రాలయం రూరల్: కూటమి ప్రభుత్వం వస్తే ఇంతేనేమో.. జనాలకు ఇలా పడిగాపులు తప్పవేమో. వలంటీర్లను తొలగించి పింఛన్‌దారులకు పడిగాపులను చేరువ చేశారు. రేషన్‌కార్డులో మార్పులు చేర్పులంటూ తెరపైకి తెచ్చారు. ఎప్పుడూ వెళ్లినా సర్వర్ లేదన్న సమాధానం తప్ప ఇంచుపని జరగని వైనం. ఆధార్‌కార్డు మార్పు చేర్పులకు తలనొప్పి తెచ్చారు. సచివాలయాల్లో ఆధార్‌సెంటర్లకు బదులుగా ఇతర సెక్టార్లకు సెంటర్లను కేటాయించారు. మండల కేంద్రంలో బీఎస్ఎన్ఎల్ నేతృత్వంలో ఆధార్ మార్పులు చేర్పులు చేస్తున్నారు. ఒక్క సెంటర్ ఉండడంతో జనాలు ఇబ్బందులు పడుతున్నారు. పిల్లాపాపలతో వచ్చి ఆధార్ కేంద్రంలో గంటల కొద్దీ నిరీక్షిస్తున్నారు. ఇదిగో ఇలా చంటిబిడ్డలతో కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్నారు.

29 నుంచి వికసిత్ కృషి సంకల్ప అభియాన్ యాత్రలు



మాట్లాడుతున్న డాక్టర్ రాఘవేంద్రచౌదరి

ఎమ్మిగనూరురూరల్: ఈనెల 29 నుంచి జూన్ 12 వరకు దేశవ్యాప్తంగా ఉన్న కృషి విజ్ఞాన కేంద్రాలు వికసిత్ కృషి సంకల్ప అభియాన్ యాత్రలు నిర్వహించనున్నట్లు బనవాసి కేవీకే సమన్వయకర్త డాక్టర్ రాఘవేంద్రచౌదరి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు మూడు గ్రామాల్లో యాత్ర ఉంటుందన్నారు. యాత్రల్లో రైతులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారుల ముఖాముఖి ఉంటుందన్నారు. ఖరీఫ్ సీజన్‌లో అనువైన పంటలు, అధిక దిగుబడినిచ్చే రకాలు, నూతన సాంకేతిక పరిజ్ఞానంపై రైతులకు అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమం ద్వారా 2 వేల మంది శాస్త్రవేత్తల బృందాలు 1.5 కోట్ల మంది రైతులను ప్రత్యక్షంగా, పరోక్షంగా చేరుకోనున్నట్లు తెలిపారు. రైతులు యాత్రలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

టీబీ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో టీబీ ముక్త్ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి టీబీ రహితంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను కలెక్టర్, జేసీ డాక్టర్ బి.నవ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూన్ 2 నుంచి ప్రారంభమయ్యే టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో ఇంటెన్సిఫైడ్ టీబీ స్క్రీనింగ్‌లో భాగంగా హైరిస్కు ఉన్న ప్రజలను గుర్తించి నాట్ టెస్టు లేదా ఎక్స్‌రే చేయాలని సూచించారు. క్షయ వ్యాధి గుర్తించిన వారికి వెంటనే చికిత్సను ప్రారంభించాలన్నారు. ఇందుకు అన్ని శాఖల అధికారులు వైద్య ఆరోగ్యశాఖ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ ఎల్ భాస్కర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి శాంతికళ, జిల్లా మలేరియా అధికారి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి దుకాణాల ద్వారా రేషన్ పంపిణీ



మాట్లాడుతున్న తహసీల్దార్ శేషఫణి

ఎమ్మిగనూరురూరల్: వచ్చే నెల 1 నుంచి రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసర సరుకులను పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ శేషఫణి తెలిపారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ ఇప్పటి వరకు వాహనాల ద్వారా ఇళ్ల వద్దకే రేషన్ పంపిణీ చేశామన్నారు. ఇక నుంచి కార్డుదారులు రేషన్ దుకాణాలకు వచ్చి రేషన్ తీసుకోవాలని సూచించారు. రేషన్ దుకాణాలు రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు తెరిచి ఉండాలన్నారు. 65 ఏళ్ల పైబడిన వారికి, విభిన్న ప్రతిభావంతులకు ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

పోషకాహార కిట్లు పంపిణీ



వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లను అందజేస్తున్న వైద్యులు

ఆదోని టౌన్: స్థానిక షరాజ్ బజారులోని యూపీహెచ్‌సీలో పేద క్షయవ్యాధిగ్రస్తులకు సోమవారం వైద్యాధికారులు షేకున్‌బాను, అనిల్, వినోద్‌కుమార్ పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ పేద క్షయ వ్యాధిగ్రస్తులకు ఆదోని యూపీహెచ్‌సీ షరాజ్‌బజార్ స్టాఫ్ సహకారంతో పది మంది పేద టీబీ వ్యాధిగ్రస్తులకు రూ.వెయ్యి విలువజేసే పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. ఇలా ఆరునెలల పాటు సరుకులు అందజేస్తామని చెప్పారు. ఎప్పటికప్పుడు వ్యాధిగ్రస్తులు వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. ఆరు నెలల్లో వ్యాధి నయమవుతుందన్నారు. సిబ్బంది సుబ్బమ్మబాయి, టీబీహెచ్‌వీ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కరోనా పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఆదోని టౌన్: దేశంలోని వివిధ ప్రాంతాల్లో కరోనా కేసులు నమోదవుతున్న వేళ పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ సురేష్‌కుమార్ సూచించారు. స్థానిక కార్యాలయంలో సోమవారం వారు మాట్లాడుతూ ప్రస్తుతం ఆదోనిలో ఒక్క కేసు కూడా నమోదు కాలేదన్నారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ముందస్తు జాగ్రత్తలతో పాటు భౌతిక దూరం పాటించాలని, మాస్కు తప్పనిసరిగా ధరించాలని చెప్పారు. ఇప్పటికే ఆరోగ్యశాఖ అన్ని చర్యలు చేపట్టిందన్నారు. హెల్త్ సర్వేలు, ఫీవర్ క్లీనిక్స్, హోం ఐసోలేషన్ కిట్లు వంటి సదుపాయాలు సిద్ధంగా ఉన్నాయన్నారు.

వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

కోసిగి: భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రుద్రగౌడ సూచించారు. ఈనెల 26 నుంచి 30వ తేదీ వరకు మండలంలో భారీ వర్షాలు, పిడుగులు పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికలతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. వాగులు, వంకలు దాటే సమయంలో జాగ్రత్తలు పాటించాలని, నది వైపు వెళ్లరాదని, చేపలు పట్టేందుకు, ఈత కోసం అటు వైపు వెళ్లరాదని సూచించారు. ఈ మేరకు గ్రామాల్లో దండోరా వేయించాలని రెవెన్యూ సహాయకులకు ఆదేశాలు జారీ చేశారు.

ప్రతిరోజూ నడకతో రక్తపోటు అదుపు

కర్నూలు(హాస్పిటల్): రక్తపోటు ఆధునిక జీవనశైలిలో అనేక మందిని ప్రభావితం చేస్తున్న నిశ్శబ్ద ఆరోగ్య సమస్య అని, ప్రతిరోజూ నడక వల్ల రక్తపోటు అదుపులో ఉంటుందని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు చెప్పారు. రక్తపోటు అవగాహన మాసోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో ఆసుపత్రిలో నిర్వహిస్తున్న వెల్‌నెస్ క్లినిక్‌లో హాస్పసర్జన్లచే రోగులకు హెల్త్‌టాక్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఆధునిక జీవనశైలిలో ఒత్తిడి, వ్యాయామం లేకపోవడం, అనారోగ్య ఆహారపు అలవాట్లు రక్తపోటుకు కారణం అవుతున్నాయని చెప్పారు. నిరంతర హెల్త్‌చెకప్, రక్తపోటును నియంత్రణలో ఉంచుకోవడం ద్వారా గుండెజబ్బులు రాకుండా కాపాడుకోవచ్చన్నారు. ప్రతి రోజూ నడకను అలవాటుగా మార్చుకోవడం ద్వారా అనేక ఆరోగ్య సమస్యలకు దూరంగా ఉండొచ్చన్నారు. ఉప్పు తక్కువగా తీసుకోవడం, పీచు ఎక్కువగా ఉండే ఆహారాలు, తాజా పండ్లు తీసుకోవాలని సూచించారు. వివిధ పోస్టర్లు, బొమ్మల రూపంలో రోగులకు బీపీపై అవగాహన కల్పించారు. కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ సుధాకుమారి, ప్రొఫెసర్ డాక్టర్ సింధియా శుభప్రద, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వెంకటేశ్వరరావు, ప్రొఫెసర్లు అరుణ, రేణుక, రాధ, నాగరాజు, ప్రవీణ, వెంకటేశ్వర్లు, పుష్పలత పాల్గొన్నారు.

ఎడతెరిపినివ్వని వర్షం

గోనెగండ్ల: నైరుతి రుతుపవనాల ప్రభావంతో మండలంలో ఆదివారం ఉదయం నుంచి సోమవారం సాయంత్రం వరకు ఎడతెరిపినివ్వకుండా వర్షం కురిసింది. దీంతో వంకలు, వాగులు పొంగి ప్రవహించాయి. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్ల వద్ద రోడ్లు జలమయమయ్యాయి. అలాగే వైఎస్సార్ సర్కిల్‌లో ఎమ్మిగనూరు – కర్నూలు ప్రధాన రహదారిపై వర్షపు నీళ్లు చేరడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. పిల్లిగుండ్ల, ఒంటెడుదిన్నె తదితర గ్రామాల దారుల్లో గుంతలు పడడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. అధికారులు స్పందించి కాలనీలలో వర్షం నీరు నిల్వ లేకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరారు.



వైఎస్సార్ సర్కిల్‌లో నిల్వ ఉన్న వర్షపు నీరు

ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించండి

- సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్



వృద్ధురాలి సమస్యలను వింటున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్: ప్రజా సమస్యల వేగంగా పరిష్కరించాలని, పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం (పీజీఆర్ఎస్)లో వచ్చిన అర్జీలను ఏఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తి పరిచేలా చూడాలని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మండలంలోని ఆయా శాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువు లోపు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో కార్యాలయ పరిపాలనాధికారి వసుంధర, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సర్వేయర్స్ వేణుసూర్య, డీఎల్‌డీవో రమణారెడ్డి, ఇరిగేషన్ డిప్యూటీ ఇంజినీర్ షఫీవుల్లా, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పద్మజ, ఆర్టీసీ డిపో మేనేజర్ మహ్మద్‌రఫీ, డిప్యూటీ డీఎంహెచ్ఓ సత్యవతి, ఆర్అండ్‌బీ డిప్యూటీ ఇంజినీర్ వెంకటేశ్వర్లు, ఉప తహసీల్దార్‌లు వలీబాషా, గుండాల నాయక్ పాల్గొన్నారు.

సమస్యల్లో కొన్ని..

- హొళగుందకు చెందిన మారెమ్మ భర్త మూకప్ప 2023లో మరణించాడని, ఇప్పటి వరకు వితంతువు పింఛన్ మంజూరు చేయలేదని, విచారణ చేసి తనకు వితంతువు పింఛన్ అందించాలని అర్జీ సమర్పించారు.
- ఆదోని మండలం విజయనగర్ కాలనీకి చెందిన మత్స్యకారులు కాలనీ సమీపంలో 6.88 ఎకరాల విస్తీర్ణంలో నీటికుంటలు ఉన్నాయని, సదరు నీటి కుంటల్లో చేపల పెంపకం కోసం అనుమతి మంజూరు చేయాలని కాలనీకి చెందిన ప్రకాష్, శేఖర్, హుసేని, వీరేష్ విన్నవించారు.
- ఆదోని మండలం 104 బసాపురం గ్రామంలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయని, వర్షాకాలం కావడంతో ముందు జాగ్రత్తగా విద్యుత్ అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామానికి చెందిన తిమ్మప్ప అర్జీ అందజేశారు.
- ఆదోనికి చెందిన ఈరన్నకు కల్లుబావి గ్రామంలో సర్వే నంబర్ 185లో 0.51 సెంట్ల భూమి ఉందని, ఆన్‌లైన్‌లో తప్పుగా చూపిస్తుందని, విచారణ చేసి భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని వినతి పత్రం అందజేశారు.

నీటి సమస్య పరిష్కారానికి చర్యలు



మాట్లాడుతున్న సి.హెచ్.లోకేశ్వరి

ఆదోని టౌన్: పట్టణంలోని శివారు ప్రాంతాలు, మురికివాడల్లో అక్కడక్కడ నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ సి.హెచ్.లోకేశ్వరి తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. కర్ణాటక ఎగువ ప్రాంతంలో వర్షాలు సమృద్ధిగా కురవడంతో తుంగభద్ర జలాశయంలో నీటి చేరిక ఆశాజనకంగా ఉందని అధికార వర్గాలు తెలిపాయన్నారు. వర్షాలు విస్తారంగా కురిస్తే డ్యాంలో పూర్తిస్థాయిలో నీరు చేరే అవకాశముందన్నారు. దీంతో వచ్చే నెలలో తుంగభద్ర దిగువ కాలువకు తాగు, సాగు నీటిని విడుదల చేసే అవకాశం ఉందని చెప్పారు. నైరుతి రుతుపవనాలు సమీపించడంతో వర్షాలు భారీగా కురుస్తున్నాయని, దీంతో పట్టణానికి మంచి నీటి ముప్పు తప్పినట్లేనని చెప్పారు. కేరళ, కర్ణాటక, తమిళనాడు, కోయంబత్తూర్, తిరుచ్చి తదితర ప్రాంతాల్లో కరోనా కేసులు పెరుగుతున్నాయని, దీంతో ముందస్తు జాగ్రత్త చర్యలు పాటించాలని పట్టణ ప్రజలను కోరారు. ప్రధానంగా పట్టణంలో శానిటేషన్ పనులు చురగ్గా చేపట్టాలని, తద్వారా ఏరోజుకారోజు లభ్యమయ్యే తడి పొడి చెత్తను తొలగించి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. పట్టణాభివృద్ధికి సంబంధించి దాదాపు వంద పనులకు టెండర్లు పిలిచామని చెప్పారు. త్వరలోనే టెండర్లను ఓపెన్ చేయనున్నామని వివరించారు.

అన్నో జరభద్రం..!

ఓ ఆటో అన్న.. జరభద్రం. ఇలా పరిమితి మించి సరుకులు వేసుకుంటే ఎలా. ఏదైనా జరగరానిది జరిగితే అంతే. బతుకు బండి సాగాలంటే మరి ఇంత సాహసం వద్దు. అదుపు తప్పిందా ప్రాణానికే ప్రమాదం. ఇలా వెళితే ఎలా అన్న కాస్త చూసుకో. పరిమితి మించితే బాగోదన్నా. మంత్రాలయం మండల కేంద్రంలో ఓ ఆటో ఇలా అధిక లోడ్ వెళ్లింది. చూసిన జనం ముక్కున వేలేసుకున్నారు.

–మంత్రాలయం రూరల్



పరిమితికి మించి సరుకులతో వెళ్తున్న ఆటో